# అబలా!

కాకర్లమూడి ఎరిక్ శాంసన్.

"క్షమించండి నాన్నగారు. నాకు ఆయనెవరో తెలియదు. పెళ్ళంటే నాలుగు రోజుల ముచ్చటకాదు. అన్నీ సరిగ్గానుంటే వందేళ్ళ కాపురం. ఆయన హృదయం నేను, నాహృదయం ఆయనా తెలిసికోందే కాపురం సాఫీగా నడవదు. అయినా పెళ్లి చేసికోడం నేను కాని మీరుకాదు."

అంతలో సుందరమ్మగారు కూతురు మాటల నందుకొంటూ "అమ్మా, నేను తెలియక అడుగుతాను నేను మీనాన్నను పెళ్లయ్యే దాక యెరుగను కాని మా సంసారంలో యేం ఒడుదుడుకులు వచ్చాయి."

"హు, స్త్రీకి స్వతంత్రం యేనాడో వచ్చింది. కనీసం పెళ్లివిషయంలోనైనా స్త్రీ తన భర్తనెన్నుకోటంలో స్వతంత్రం ఇస్తే దేశం యేనాడో బాగుపడేది..."

"ఛ. నోరుముయ్ పిట్టకొంచెము కూత ఘనము, అయినా నీకీ వెధవప్రసంగం యెందుకు! మేమెవర్ణికడ్తే వాడే నీ మొగుడు" అని అంతదాక ఊరుకొన్న విశ్వనాథంగారు గదుమగనే వసంత తన గదిలోకిపోయి అదేపనిగా యేడ్వడం మొదలుబెట్టింది.

వసంత చదువు, సంస్కారముగల పిల్ల. ఇంటరు పరీక్ష రాసింది. యెదిగిన పిల్ల. ఇంతకాలం యింట్లో ఉండడం చేత నలుగురు నాలుగుమాటలు అనడం మొదలు బెట్టారు. విశ్వనాథంగారు ఇహ సహించలేక వరుణ్ణి అన్వేషించుటకు బయలుదేరి యెలాగైతేనేమి తనస్థితికి సమానమైన ఒక బి. యే. ప్యాస్ అయినా కుర్రాణ్ణి వరునిగా తెచ్చారు. పేరు శాంబాబు. పిల్ల యిష్టపడినా, యిష్టపడక పోయినా, దగ్గర ముహూర్తం నిశ్చయించారు.

ఏలాగైతేనేమి వసంత మెళ్లో ఆ మూడు ముళ్లూ వేయించేదాక విశ్వనాథం సుందరమ్మలకు నిద్రపట్టలేదు. అయిందేదో అయిందని వసంత కాపర్తానికి పోయింది. అత్తగారు మొదట్లో బాగున్నా ఉండేకొద్ది తొండ ఊసరిల్లి అయింది. అయినా ఈ అత్తగార్లు ఒకప్పుడు తామూఒకింటి కోడళ్లమని యెందుకు మరచిపోతారో!

శాంబాబు పెళ్లయిన క్రొత్తలో వసంతను విడిచి క్షణం ఒక మహాయుగంలా గడిపి ఆఫీస్ టయిమ్ అయి అవకముందే యింటికివచ్చి వసంతతో హాయిగా కాలం గడిపేవాడు. కాలం అలాగ దొర్లిపోతూంది. ఇప్పుడు వసంతకు యిద్దరు మొగపిల్లలు. ఒకడు వసంతకుమార్, ఇంకొకడు విజయకుమార్. కాలక్రమంగా శాంబాబు ఇంటికి ఆలస్యంగా రావడం మొదలు పెట్టాడు. ఒక్కొకప్పుడు హోటల్లో భోంచేసి సినిమా

చూచి వచ్చేవాడు. ఆలస్యంగా వచ్చేరేం అని అడిగితే "ఏం, నీ సన్యాసి మొఖానికి యెప్పుడు యెదురుగ ఉండాలనేమి" అని కసరుకొనేవాడు.

'ఛీ, యీ మగజాతి అంతా ఇంతే. పెళ్లికాకముందు మేము వీళ్ళకు అప్సరసలము. మేము ఒక్కసారి వాళ్ళవైపు చూస్తే సరి వాళ్ళకు దేముని ప్రసాదముతో సమానం. మేము నిరాకరిస్తే, ఆత్మహత్య చేసికొంటాము అంటారు. మేము వారితో సంతోషంగా ఉంటే స్వర్గసౌఖ్యాలను అనుభవిస్తున్నామంటారు. కాని పెళ్ళయి సంతానం కలిగింతరువాత మేము వారికి చీడపురుగులము. మా ముఖాలు, సన్యాసిముఖాలు ఇంకా యెంత గానో నీచంగా చూడబడుతాము!' అని వసంత యేమేమో అనుకొనేది.

ఒకరోజు వసంత స్నేహితురాళ్ళతో పాటు పొరుగింటికి పేరంటాలకు పోయింది. వచ్చేప్పటికి కొంచెం ఆలస్యమయింది. ఆరోజు యెందుకో కొంచెం త్వరగా వచ్చాడు. వసంత కాస్త ఆలస్యంగావస్తే నానామాటలు చీవాట్లు పెట్టాడు. వసంతకు కళ్ళంబడి నీళ్లు బొటబొటా రాలాయి. పాపం ఆమె యేం నేరం జేసిందని శాంబాబు ఆమెను ఆవిధంగా చీవాట్లు బెట్టాడు. తాను ప్రతిరోజు ఆలస్యంగా వస్తుంటే ఆమె "ఇలా ఆలస్యంగావస్తే యెలాగండీ" అనే మాట తప్ప తక్కిన మాటలు మాట్లాడలేదుకదా. అట్లయితే శాంబాబు ఆమెను అంతకష్టపెట్టాడెందుకు ఆయనను యెవరు అనేవాళ్ళు లేరనా? సంఘం పురుషులది కాబట్టి తానేవిధంగానైన ప్రవర్తించవచ్చునా? సంఘం పురుషులదైనప్పటికిని స్త్రీకి సముచితమైన స్థానమివ్వాలి. ఆమెను అన్నివిధములుగ గౌరవించుట సంఘానికి శ్రేయస్కరము. అలాంటప్పుడు ఆమెను అన్నివిధములుగ గౌరవించుటే సంఘానికి శ్రేయస్కరము. అలాంటప్పుడు ఆమెను ప్రతిచిన్న విషయంలో దండించుట సంఘానికి తలవంపు.

శాంబాబు కొన్నాళ్ళకు యింటికిరావడం మానేశాడు. జీతం సరిగ్గా యింటికి తేవటం లేదు. వసంత భర్తవిషయంలో కొంత కలవరపడింది. భర్త సానికొంపలు చుట్టు తిరుగుతున్నాడనే వార్త వసంతచెవిలో పడింది. యేం జేస్తుంది పాపం! చెవిలో పడిన వార్తలు చెవిలోనే దాస్తోంది సంసారం గుట్టుగా జరుపుకుంటూంది.

ఒకరోజు శాంబాబు తాను ప్రేయసిగా నెంచిన స్త్రీకి ఇంకొక పురుషునితో సంబంధమున్నట్లు గ్రహించాడు. ఛీ! అనిపించింది. తానేమి చేయగలడు? ఆస్త్రీ డబ్బుకు కొనబడే వస్తువులాంటిది. ఎవరిదగ్గర డబ్బుంటే వాడిదే ఆమె. దాంతో శాం

బాబు కామాంధకారం కాస్తా పటాపంచలయింది. కళ్ళు తెరవబడ్డాయి. భార్యా పిల్లలు జ్ఞాపకం వచ్చారు. గృహోన్ముఖుడయ్యాడు. పిల్లల్ని దగ్గరకు తీసికొని ముద్దుపెట్టుకొన్నాడు. వసంతను క్షమాపణ అడిగాడు. పాపం వసంత యిక యేం చేయగలదు! స్త్రీ హృదయం అంతలో పాషాణం అవుతుంది; అంతలోనే మంచువలె కరిగి పోతుంది. స్త్రీకి ముఖ్యంగా యిదే బలహీనత. ఇందువల్లనే ఆమె తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయి అబల అనిపించుకొంటున్నది.




సూర్యోదయము